6న తైబజార్, షాపులకు వేలం

పోచారం: విలీన గ్రామాలతో పాటు పోచారం మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ (అంగడి) రుసుం వసూలు చేసేందుకు ఈనెల 6 న మధ్యాహ్నం 12:30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ వీరారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఉదయం 10:30 గంటలకు రాజీవ్ గృహకల్ప, నారపల్లిలోని మున్సిపల్ షాపులు, అన్నోజిగూడలోని ఎల్ఎన్ కాలనీ ఫంక్షన్ హాల్, కొర్రెముల్ విలేజ్ ఫంక్షన్ హాల్‌కు కూడా వేలం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 5 న సాయంత్రం 5 గంటల్లోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని కోరారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి,సిటీబ్యూరో: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వాల్యూవేషన్ ఫలితాల కోసం వేచి చూడకుండా, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే వారు ఈనెల 16 లోగా ప్రధానోపాధ్యాయుడికి ఫీజు చెల్లించాలని ఆమె కోరారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: రైల్వే గేట్ సమీపంలో శ్రీదుర్గా భవానీ మందిర వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీభవానీ శంకరస్వామి (స్ఫటిక లింగం) త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర శత కలశాభిషేకం, రుద్రహవనం, మహాపూర్ణాహుతి, ఆలయ శిఖరాలకు కుంభాభిషేకం, మంత్ర పుష్పం పూజ కార్యక్రమాల అనంతరం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు అన్యాయం'

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం వరంగల్, కరీంనగర్ జిల్లాలకు సైనిక్ స్కూళ్లను మంజూరు చేసినా గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకకపోవడం వల్లే విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని మేడ్చల్‌కు చెందిన సైనిక్ స్కూల్ పేరెంట్స్ ఆవేదన వ్యక్తం చేశారు. మేడ్చల్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ.. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదువుతున్న తెలంగాణ విద్యార్థులను స్థానికేతరులుగా గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రంలో సైనిక్ స్కూళ్లను నిర్మించాలని కోరారు. సమావేశంలో సైనిక్ స్కూల్ పేరెంట్స్ మల్లేశం, శ్రీరంగవరం మాజీ సర్పంచ్ పోచయ్య, బాపురెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, నగేశ్ పాల్గొన్నారు.

'అనారోగ్యంతోనే రాహుల్ ఆత్మహత్య'


రాహుల్ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన రాహుల్ (24) అనారోగ్య కారణాలే వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. బెట్టింగ్ యాప్‌ల వల్లే బలయ్యాడని కొన్ని ప్రసారా మాధ్యమాలు, సోషల్ మీడియాలో వార్తలు రావడంపై వారు ఖండించారు. తమ కుటుంబం అంటే గిట్టని వారే తప్పుడు ప్రచారాలు చేస్తూ మీడియాను తప్పుదోవ పట్టించి తమపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. రాహుల్ 4 నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ మనోవేదనకు గురయ్యాడని పేర్కొన్నారు. రాహుల్‌కు ఎలాంటి చెడు అలవాట్లు లేవని తమపై కక్షతోనే కొంత మంది రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ..

శామీర్‌పేట్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పోచంపల్లి హనుమంతు (48), క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారిలోని కట్టమైసమ్మ బ్రిడ్జి (వంతెన)పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అర్హులెవరో..?

'రాజీవ్ యువ వికాసం' లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
దరఖాస్తుల పరిశీలన షురూ.. వడబోతపై ప్రత్యేక దృష్టి

- మండల, పట్టణ స్థాయి కమిటీలకు కన్వీనర్‌గా ఎంపీడీఓ/కమిషనర్
- జిల్లాస్థాయి కమిటీకి కన్వీనర్‌గా కలెక్టర్, మరో 8 మంది సభ్యులు
- వచ్చిన దరఖాస్తులు : 66,648, జిల్లాకు మంజూరైన యూనిట్లు: 24,610


జవహర్‌నగర్‌లోని మీ సేవ సెంటర్‌లో దరఖాస్తు చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకు దరఖాస్తుల వడబోత మొదలైంది. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు అర్హుల జాబితాను రూపొందించేందుకు సంబంధిత శాఖల అధికారులతో మండల/పట్టణ, జిల్లాస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసింది. ముందుగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ల వారీగా విభజించారు. వీటిని సంబంధిత అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

కమిటీల పర్యవేక్షణలో..

మండల, పట్టణ స్థాయిలో పురపాలక కమిషనర్/ఎంపీడీఓ కన్వీనర్‌గా, మండల ప్రత్యేకాధికారి, సంబంధిత కార్పొరేషన్లకు చెందిన అధికారి, బ్యాంక్ మేనేజర్, డీఆర్డీఏ నుంచి ఒకరిని సభ్యులుగా నియమించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ కన్వీనర్‌గా 8 మంది వివిధ శాఖల అధికారులతో పాటు బ్యాంక్ అధికారి సభ్యులుగా ఉంటారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులు పరిశీలిస్తారు. దరఖాస్తుదారులు గత ఐదేళ్లగా కార్పొరేషన్ల నుంచి రుణాలు తీసుకున్నారా..? ఆ కుటుంబంలో ప్రభుత్వోద్యోగులు ఉన్నారా..? వారి ఆర్థిక స్థితిని పరిశీలించి మండల కమిటీకి నివేదిస్తారు. పట్టణాల్లో (పురపాలక సంఘాల్లో) వార్డు అధికారులు దరఖాస్తులను పరిశీలించి పట్టణ కమిటీలకు అందజేస్తారు. అక్కడి నుంచి జిల్లా కమిటీకి జాబితాను పంపిస్తారు. లబ్ధిదారుడు ఎంచుకున్న యూనిట్లను అనుసరించి రాయితీలు అందనున్నాయి. రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణాలు అందించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని కమిటీల పర్యవేక్షణలోనే పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

శాఖలు	దరఖాస్తులు	యూనిట్లు
బీసీ, ఈబీసీ	37,935,	13,400
ఎస్సీ	16,300,	6,201
ఎస్టీ	2,196,	1,594
మైనార్టీలు, క్రిస్టియన్లు	10,217,	3,415.

కులగణన ప్రకటన రాహుల్‌గాంధీ ఘనతే


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: దేశంలో జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సాధించిన విజయమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో మండల, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా భారత్ జోడో యాత్ర నిర్వహించిన సమయంలో దేశంలో చాలా వర్గాల సంఖ్య లేకపోవడంతో వారు అన్ని విధాలా నష్టపోతున్నారని గుర్తించారని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని హామీనిచ్చారని పేర్కొన్నారు. ఆయన హామీ మేరకే రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణన చేశారని గుర్తుచేశారు. వీటిని గుర్తించిన కేంద్రం ప్రభుత్వం జనాభా లెక్కలతో పాటు కుల గణన చేయాలని కేబినెట్‌లో తీర్మానం చేసిందని అన్నారు. సమావేశంలో నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, రమేశ్, మల్లేశ్‌గౌడ్, కొండల్‌రెడ్డి, దేవ, మహేశ్, రామకృష్ణరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శంకర్, నాగభూషణం, రామస్వామి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పోచారం: ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం కూల్చివేశారు. అన్నోజిగూడలోని సర్వే నంబర్లు 18, 19లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో 1050 చదరపు గజాల స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించారు. అయితే లేఅవుట్‌లోని ఈ జాగాను బైనంబర్లతో ప్లాట్లుగా చేసి క్రమంగా ఆక్రమిస్తున్నారు. ఇందులో సుమారు 400 చదరపు గజాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి, రేకుల రూం నిర్మించారు. సమాచారం అందుకున్న పోచారం మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఇంతలో ఇద్దరు వ్యక్తులు గదిలోకి వెళ్లి తలుపులు పెట్టుకోవడంతో గదిని అలాగే ఉంచి, జేసీబీతో ప్రహరీని కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'నీట్' కేంద్రాల పరిశీలన


ఉప్పల్ కేవీ-1 పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వాణీరెడ్డి, ఏసీపీ చక్రపాణి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో జరిగే నీట్ పరీక్షా కేంద్రాలను ఉప్పల్ తహసీల్దార్ వాణీరెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి శుక్రవారం పరిశీలించారు. ఉప్పల్‌లోని కేంద్రీయ విద్యాలయాలు–1,2 పాఠశాలల్లోని ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 పరీక్ష ప్రారంభం అవుతుందని, ఉదయం 11 నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి పంపిస్తామని 11.30 తర్వాత వచ్చేవారిని హాల్‌లోకి అనుమతించమని తెలిపారు.

శ్రద్ధ రిహాబిలిటేషన్ సెంటర్లో తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రద్ధ రిహాబిలిటేషన్ సెంటర్లో పాండు నాయక్ అనే వ్యక్తి గురువారం మృతి చెందిన ఘటన 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితం కాగా స్పందించిన డీఎంహెచ్‌వో అధికారులు శుక్రవారం ఆ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు, డాక్టర్, నర్సులు లేకుండానే సెంటర్ నిర్వహిస్తున్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, సీపీడీఓ స్వాతి తెలిపారు. సెంటర్‌ను శనివారం ఉదయం 9 గంటలకు సీజ్ చేస్తామని, అప్పటివరకు సెంటర్‌లోని రోగుల కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా సంప్రదించి ఇంటికి తీసుకెళ్లాలని లేకుంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించాలని కోరుతామన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: శ్రీనివాసపురం, వివేక్‌నగర్, కామాక్షిపురం మీదుగా వెళ్లే ఓపెన్ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులు నత్త నడకన సాగుతున్నాయని దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 15 రోజుల్లోగా పనులు పూర్తి చేయకుంటే జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ నాగమణి, ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌తో పాటు డివిజన్ బీజేపీ నేతలు బండారు వెంకటరావు, ఉనుకొండ నారాయణదాసు, రవి, అంజయ్య పటేల్, లింగం, దర్శనాల సుధాకర్, సాయినాథ్, శివ, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం


ఎంపీడీవో గ్యామానాయక్‌ను సత్కరిస్తున్న కార్యదర్శులు

కీసర: కీసర ఎంపీడీవో గ్యామానాయక్‌ను మండల పరిధిలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహించిన గ్రామ కార్యదర్శులు శుక్రవారం నిర్వహించిన ఆరో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సురేశ్‌రెడ్డి, గంగన్న, ఏపీఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం మంజుల

మేడ్చల్: పట్టణంలోని జడ్పీ బాలికల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు రచన 570 మార్కులు, సోనాలి కంబ్కే 530, షేక్ అమీనా 529 మార్కులు సాధించి మండల స్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. దీంతో వారిని, వారి తల్లిదండ్రులను హెచ్ఎం మంజుల, టీచర్లు అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి పనులు కొనసాగించండి

మల్కాజిగిరి: అభివృద్ధి పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ శుక్రవారం జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత కమిషనర్ ఇలంబర్తి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారని వాటిని కొనసాగించాలని కోరామన్నారు. దోమల నియంత్రణకు కోల్డ్ ఫాగింగ్, బాల సరస్వతీనగర్‌లో నాలా నిర్మాణంలో నిర్వాసితులకు నష్ట పరిహారం, అసంపూర్తిగా ఉన్న బస్తీ దవాఖానాల నిర్మాణంతో పాటు చెరువుల అభివృద్ధి తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

పహల్గాం దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

మౌలాలి: పహల్గాం దాడి ఉగ్రవాదులను ఉరితీయాలని మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీత డిమాండ్ చేశారు. సంతోషిమాతాకాలనీ, సుధానగర్, ఓల్డ్‌సఫిల్‌గూడ, ఆఫీసర్స్‌కాలనీ, సాయినాథపురం కాలనీవాసులు శుక్రవారం సంయుక్తంగా నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆమె పాల్గొని మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. సంతోషిమాతా ఆలయం నుంచి సాయినాథపురం వరకు ర్యాలీ నిర్వహించారు.



రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ, కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాల్లో రైతు సేవాసహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

31 పాఠశాలల్లో సమ్మర్ క్యాంపు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో 31 ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 15 వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు (సమ్మర్ క్యాంపులు) నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో విజయ కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్యాంపులు కొనసాగుతాయన్నారు. యోగా, ఆటలు, ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్స్, తబలా, మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలలో 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సమ్మర్ క్యాంపుల పాఠశాలలు..

జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు కొనసాగుతున్నాయని డీఈఓ తెలిపారు. కొకూర్, అల్వాల్ (బాలికలు), ప్రగతినగర్, నిజాంపేట, బబ్బుగూడ, బాలానగర్, కొంపల్లి, దుండిగల్, కొర్రెముల్, ఘట్‌కేసర్ (బాలురు), బాలాజీ నగర్, కుషాయిగూడ, బాలాజీ నగర్, నాగావరం, ఎల్లమ్మబండ, ముసాపేట (బాలికలు), మౌలాలి (ప్రభుత్వ హైస్కూల్), మల్కాజిగిరి బాలికల హైస్కూల్, పూడూరు జెడ్పీహెచ్ఎస్, మేడ్చల్ బాలికల హైస్కూల్, పీర్జాదీగూడ హైస్కూల్, మేడిపల్లి, బోడుప్పల్, కొల్తూర్, లక్ష్మాపూర్, నెహ్రూనగర్, జీడిమెట్ల, శామీర్‌పేట, తూంకుంట, మల్లాపూర్, జెడ్పీహెచ్ఎస్, ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలు.

జూన్ 6 వరకు శిక్షణ శిబిరాలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా 10 కేంద్రాలను ఎంపిక చేశారు. ఈనెల 1న ప్రారంభమైన శిబిరాలు జూన్ 6 వరకు కొనసాగనున్నాయి. 14 ఏళ్ల లోపు బాలబాలికలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు కొనసాగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి జీవీ గోపాల్‌రావు తెలిపారు. శిక్షకులకు సంబంధిత క్రీడా సామగ్రి తోపాటు గౌరవ వేతనం ఇస్తున్నామన్నారు.

8 రూరల్, 15 అర్బన్ కేంద్రాల్లో శిక్షణ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 8 రూరల్, 15 అర్బన్ కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించినట్లు గోపాల్‌రావు తెలిపారు. తూంకుంట, శామీర్‌పేట, మునీరాబాద్, తుర్కపల్లి (2 కేంద్రాలు), ఉద్దమర్రి, అద్రాసుపల్లి, కోల్తూర్, మజీద్‌పూర్, జీడిమెట్ల, చింతల యాద్గార్‌పల్లి, చౌదరిగూడ, జోడిమెట్ల, మేడ్చల్, కొర్రెముల, కీసర, కొకూర్‌ల్లో వాలీబాల్, నెట్‌బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, బాక్సింగ్, అథ్లెటిక్స్, కబడ్డీ తదితర ప్రాథమిక శిక్షణ ఇస్తారన్నారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగించడంతో పాటు, ప్రతిభావంతులను గుర్తించి వారిని రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బీజేపీతోనే జాతీయ రహదారుల అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి

ఘట్‌కేసర్: జాతీయ రహదారుల అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో రూ. 102 కోట్లతో బైపాస్ జంక్షన్, అంకుషాపూర్, మైసమ్మగుట్ట, ఎన్టీపీసీ అండర్ పాస్ రోడ్ల పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై నిత్యం 50 వేల వాహనాలు ప్రయాణిస్తాయని, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు పనులు సాగుతాయన్నారు. రద్దీగల ప్రాంతాల్లో అండర్ పాస్ రోడ్లు, జంక్షన్ ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయన్నారు. ఘట్‌కేసర్‌లో 14 ఏళ్లుగా రైల్వే వంతెన పనులు సాగుతున్నాయని, కొందరు నాయకులు అండర్ పాస్ రోడ్ల పనులకు వినతి పత్రాలు ఇచ్చి పబ్బం గడుపుకుంటారని ఎద్దేవా చేశారు. పనులకు సహకరించిన కేంద్ర మంత్రి గడ్కరీ, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలనర్సింహాయాదవ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, అనిల్‌గౌడ్, పవన్‌సింగ్ పాల్గొన్నారు.

బాలాజీ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేయిస్తున్న వజ్రేశ్ యాదవ్

పోచారం: వెంకటాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై చైర్మన్ చింతపంటి సత్తయ్య, సభ్యులు మాడగోని ఆంజనేయులు, ఊదరి వెంకటేశ్, కంతి లావణ్య, బండారి సుధాకర్, అర్చకుడు ఏడవల్లి వినయ్ శర్మతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి పనుల్లో 20 శాతం వాటాను దాతల నుంచి సేకరిస్తే మిగిలిన 80 శాతం ప్రభుత్వం భరిస్తుందని, అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వేముల మహేశ్ గౌడ్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంతర్‌రెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, కర్రె రాజేశ్, జడిగె రమేశ్, రేసు లక్ష్మారెడ్డి, గోపు బాలరాజ్, మెట్టు నర్సింహారెడ్డి, మెరుగు నరేశ్, మారం లక్ష్మారెడ్డి, భోజిరెడ్డి, నర్సింగ్‌రావు, వినోద్, వేణుగోపాల్, నీరుడు శ్రీనివాస్, ఉదారి సుదర్శన్, బుర్ర వెంకటేశ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత అన్నారు. ఉప్పల్ వార్డు కార్యాలయంలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఏఎంహెచ్‌వో డా. రణజీత్, వీధి లైట్ల అధికారి రవీందర్, జలమండలి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీరు, రోడ్ల స్వీపింగ్, వీధి లైట్ల ఏర్పాటు, నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఇందు కోసం ప్రత్యేకంగా అదనంగా 25 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మందుముల పరమేశ్వర్ రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



గౌతంనగర్: జయగిరి లక్ష్మీనర్సింహాస్వామి నగర్‌లో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ, మహంకాళి, ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభయ్యాయి. అమ్మవార్ల ఊరేగింపు, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, ఋత్వికరణ, అఖండ దీపారాధన, మంటపారధన ఆహ్వానాల కలశస్థాపన, అగ్నిప్రతిష్ట, సాయంత్రం ప్రదోషకాల పూజ, జలాధీవాసం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.